ప్రజాశక్తి
గురువారం 7 ఆగస్టు 2025
5
విజయనగరం

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

వచ్చేనెల 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను చిట్‌ఫండ్‌కంపెనీలు, బ్యాంకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత తెలిపారు. ఆయా కంపెనీల మేనేజర్లు, న్యాయవాదులతో జిల్లా కోర్టులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిట్ కంపెనీలు, బ్యాంక్ కు సంబంధించిన కేసులను జాతీయ లోక్ అదాలత్ లో ఎక్కువ సంఖ్యలో పరిష్కరించుకోవాలని సూచించారు. పెండింగ్ లో ఉన్న కేసులను రాజీ చేయాలని న్యాయవాదులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్, లీడ్‌బ్యాంకు మేనేజర్, పలు చిట్‌ఫండ్‌కంపెనీల మేనేజర్లు పాల్గొన్నారు.



ఈనెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు

- కేబినెట్ గ్రీన్ సిగ్నల్
- జిల్లాలో రోజుకు 25వేల మంది మహిళలు ప్రయాణించే అవకాశం
- 177 బస్సులు కేటాయింపు
- ఐదు రకాల బస్సుల్లోనే అనుమతి
- ఆధార్, ఓటరుకార్డు, రేషన్‌కార్డు చూపించి రాష్ట్రంలో ఎక్కడికైనా ప్రయాణం

ప్రజాశక్తి-విజయనగరంకోట

టిడిపి కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ఈనెల 15 నుంచి అమలు కానుంది. ఆగస్టు 15 సందర్భంగా స్త్రీశక్తి పథకం పేరుతో ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనుంది. ఈమేరకు బుధవారం జరిగిన రాష్ట్రకేబినెట్ సమావేశంలో ఈ పథకం అమలుకు ఆమోదం తెలిపింది. దీంతో జిల్లాలోని మహిళలందరికీ ఆర్‌టిసిలో ఉచితంగా ప్రయాణించే అవకాశం కలగనుంది. రాష్ట్రంలో 5.25కోట్ల జనాభా ఉండగా అందులో 2.62కోట్ల మంది మహిళలు ఉన్నారు. జిల్లా జనాభా 23.44 లక్షలు కాగా అందులో మహిళలు 11లక్షల 74వేల మంది ఉన్నారు. వీరిలో రోజూ 25వేల మంది మహిళలు బస్సుల్లో ప్రయాణించే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.ఈ పథకం కింద మహిళలు, బాలికలు ట్రాన్స్‌జెండర్లు ఎక్కడి నుండి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రాష్ట్రంలో ఎక్కడినుంచి ఎక్కఃడికైనా ప్రయాణించేందుకుఅవకాశం కల్పించింది.

జిల్లాలో రోజుకు 25వేల మంది ప్రయాణించే అవకాశం

జిల్లాలో ప్రధానంగా విజయనగరం, శృంగవరపుకోట ఆర్‌టిసి డిపోల ద్వారా ప్రజలకు ప్రజా రవాణా అందిస్తోంది. ఈ రెండు డిపోల్లో రోజుకు ప్రస్తుతం సుమారు 12వేల మంది వరకు ప్రయాణిస్తున్నట్లు సమాచారం. ఉచిత ప్రయాణ పథకం అమల్లోకి వస్తే 25వేల మంది మహిళలు ప్రయాణించే అవకాశం ఉందని ఆర్‌టిసి అధికారులు అంచనా వేశారు. మహిళా ప్రయాణికులకు తగ్గట్టుగా 137 బస్సులను అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. అందులో పల్లె వెలుగు 108, అల్ట్రా పల్లె వెలుగు 7, మెట్రో 14, ఎక్స్‌ప్రెస్‌లు ఎనిమిది బస్సులను ఉచిత ప్రయాణానికి కేటాయించారు. బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాఇన్న వినియోగించుకునేందుకు మహిళలు ఆధార్, ఓటర్, రేషన్ కార్డులను ఐడి ప్రూఫ్‌లుగా చూపించాల్సి ఉంటుంది. ఈ పథకం అమలులో ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ఉండేందుకు ప్రభుత్వం మహిళా కండక్టర్లకు బాడీ కెమేరాలు, బస్సులలో సీసీ కెమెరాలు అమర్చనుంది. తద్వారా మహిళల, బాలికల భద్రతకు పెద్ద పీట వేయనున్నట్లు రాష్ట్ర సమాచార పౌర సంబంధాలశాఖా మంత్రి కె.పార్థసారధి వెల్లడించారు. అలాగే బస్ స్టేషన్లలో మౌలిక వసతులైన ఫ్యాన్లు, మంచి నీటి సౌకర్యం కూడా కల్పించనున్నారు.

జిల్లాలోని విజయనగరం డిపో పరిధిలో 47, శృంగవరపుకోట పరిధిలో 13 రూట్లు మొత్తంగా 60 రూట్లలో ఆర్‌టిసి బస్సులు నిరంతరం ప్రయాణిస్తున్నాయి. విజయనగరం డిపో పరిధిలో రోజుకు 46,489 కిలోమీటర్లు, ఎస్.కోట డిపో పరిధిలో 16,384 కిలోమీటర్లు మొత్తంగా 62,843 కిలోమీటర్లు ప్రయాణిస్తున్నాయి.

ఎంఎస్ఎంఇ పార్కు ప్రతిపాదన విరమించుకోవాలి

గిరిజనులకు అన్యాయం చేస్తే ఉపేక్షించం : మాజీ ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

ప్రజాశక్తి-రామభద్రపురం

దశాబ్ద కాలంగా గిరిజనులు సాగుచేస్తున్న భూములను బలవంతంగా లాక్కొని ఎంఎస్ఎంఇ పార్కు నిర్మించాలనే ప్రతిపాదనను విరమించుకోవాలని మాజీ డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర డిమాండ్‌చేశారు. మండలంలో కారేడువలస, కాకర్లవలస గ్రామాల్లో బుధవారం పర్యటించి అక్కడి గిరిజనులతో మాట్లాడారు. ఈ ప్రాంతంలో గిరిజనులు ఈ భూములను వేలాది రూపాయలు మదుపులుతో సాగుచేసుకొని ఫలసాయం పొందే సమయానికి ఎంఎస్ఎంఇ పార్కుకు కేటాయించామని అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భూములు గిరిజనులకే చెందుతాయన్నారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనులకు వెంటనే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2010లోనే ఇక్కడ 360 ఎకరాల్లో వనసంరక్షణ సమితులు ఏర్పాటు చేసి వాటిని సాగు చేసుకోవడానికి అప్పుడు అధికారులు అవకాశం ఇచ్చారని, ఇప్పుడు ఈ భూములపై హక్కులేదని అనడం సమంజసం కాదన్నారు. ఎపిఐఐసి అధికారులు గిరిజనులు పండిస్తున్న మామిడి, జీడి, జొన్నపంటలను ధ్వంసం చేయడం సబబుకాదని, అడవులను నాశనం చేసే చర్యలపై సుప్రీంకోర్టు తీవ్రంగా మందలించిందనే విషయాన్ని గుర్తు చేశారు. సాగుచేసిన భూములను జెసిబిలతో ధ్వంసం చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. అమాయక గిరిజనులను మోసం చేయడానికి అధికారులు ప్రయత్నిస్తే చట్టరీత్యా పోరాటం చేస్తామని తెలిపారు. గత జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో 3 లక్షల ఎకరాల అటవీభూమి లక్షా 50 వేల మందికి పంపిణీ చేశామని, గిరిజనుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం ఎంతో తోడ్పాటును అందించిందని తెలిపారు.

గిరిజనులతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు రాజన్నదొర, శంబంగి

ఇప్పటికైనా రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం గిరిజనుల హక్కులను కాలరాయకుండా వారి జీవనోపాధి దెబ్బతీయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు మాట్లాడుతూ కారేడువలస, కాకర్లవలస గిరిజనులకు తమ పార్టీ అండగా ఉంటుందని, ఇప్పుడు సాగుచేస్తున్న భూములకు పట్టాలు ఇచ్చేవరకు పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు, మిర్తివలస సర్పంచ్ మజ్జి రాంబాబు, సిఐటియు నాయకుడు బలస శ్రీనివాసరావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

15 నుంచి ప్లాస్టిక్ రహిత కార్యాలయాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆగస్టు 15 నుండి నగరంలోని అన్ని సచివాలయాలు, నగరపాలక సంస్థ కార్యాలయాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలని నిర్ణయించినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. బుధవారం కార్యాలయంలో ప్రజారోగ్య సిబ్బంది, సచివాలయ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 2 నుండి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని, అందుకు సన్నాహకంగా ఆగస్టు 15వ తేదీ నుండి ప్లాస్టిక్ రహిత కార్యాలయంగా తీర్చిదిద్దేందుకు సమాయత్తమవుతున్నట్లు తెలిపారు. ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. ఇంటింటి చెత్త సేకరణ శతశాతం జరిగే విధంగా చూడాలన్నారు. హోం కంపోస్టుపై ప్రజలకు అవగాహన పెంచాలని, మిద్దె పంటలను ప్రోత్సహించాలని తెలిపారు. ఈ నెలలో 50,000 మొక్కలను నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు. సమావేశంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, పారిశుధ్య పర్యవేక్షకులు, మేస్త్రీలు, సూపర్వైజర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

9న జిల్లా స్థాయి యోగా పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 9న ఉదయం 8 గంటలకు తోట పాలెంలోని గాయత్రి టెక్నో స్కూల్ లో యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన జిల్లా స్థాయి యోగాసన పోటీలు నిర్వహిస్తున్నారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో బాలికలు, బాలురు, స్త్రీ, పురుషులు 8 నుండి 50 సంవత్సరాలు వారు వారి వారి విభాగాలలో పోటీల్లో పాల్గొనవచ్చునని అసోసియేషన్ అధ్యక్షులు అవనాపువిక్రమ్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు వారి పేర్లను ఈనెల 8వ తేదీ సాయంత్రం 9 గంటల లోపు నమోదు చేసుకోవాలని కోరారు. జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నాలుగు స్థానాలు వారు పశ్చిమగోదావరి జిల్లా, తాడేపల్లిగూడెంలో నిర్వహించే రాష్ట్రస్థాయి యోగ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారు, మైసూర్ (కర్ణాటక)లో నిర్వహించు జాతీయస్థాయి యోగా పోటీలలో పాల్గొంటారని, జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారు అంతర్జాతీయ యోగా పోటీలలో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 8374904262,7993696087 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

నేడు చేనేత దినోత్సవం

ప్రజాశక్తి-రాజాం

జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమాన్ని రాజాంలో గురువారం నిర్వహించనున్నట్లు జిల్లా చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు ఆర్‌వి మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. రాజాం ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి నటరాజ కల్యాణ మండపం వరకు హ్యాండ్‌లూమ్ వాక్ నిర్వహిస్తామని, అక్కడ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ చేనేత కార్మికులను సన్మానించనున్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా 1905లో విదేశీ వస్త్రాలను బహిష్కరిస్తూ, స్వదేశీ వస్త్రాలను ప్రోత్సహించే ఉద్యమాన్ని ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని 2015 నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రతీ సంవత్సరం ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించారని వివరించారు. రాజాంలో నేడు జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు

వారోత్సవాలు నిర్వహిస్తున్న ఐసిడిఎస్ అధికారులు, అంగన్వాడీలు

తల్లి పాలు బిడ్డలకు మేలు

ప్రజాశక్తి - కంటోన్మెంట్

తల్లిపాలు బిడ్డలకు ఎంతో మేలని ఐసిడిఎస్ అర్బన్ ప్రాజెక్టు సిడిపిఒ ప్రసన్నకుమారి అన్నారు. విజయనగరం మండలం ద్వారపూడి గ్రామంలోని అంగన్ వాడీ కేంద్రం 2లో తల్లిపాలు వారోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ గర్భిణీలకు, బాలింతలకు తల్లి పాల ప్రాముఖ్యత గురించి వివరించారు. నెలల వరకు కేవలం తల్లి పాలు మాత్రమే బిడ్డకు ఇవ్వాలని, తల్లి పాలు బిడ్డకి పెట్టడం వలన తల్లులకు బ్రెస్ట్ కేన్సర్ వంటి అనారోగ్యాలు దరి చేరవ న్నారు. తల్లిపాలు వలన తల్లికి,బిడ్డకి అనుబంధం ఏర్పడుతుందని, తల్లిపాలు వలన తల్లికి బిడ్డకి కూడా ఆరోగ్యం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆదిలక్ష్మి ,సూపర్ వైజర్ అర్.పైడితల్లి, ఎఎన్ఎం, అంగన్ వాడీ వర్కర్స్, ఆశా వర్కరులు పాల్గొన్నారు

సృజనాత్మక శక్తిని పెంపొందించాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మక శక్తిని పెంపొందించాలని స్థానిక గాజులరేగ నారాయణ స్కూలు కరస్పాండెంట్ మొయిద నారాయణరావు అన్నారు. బుధవారం పాఠశాలలో జాతీయ జెండా, జాతీయ నాయకుల చిత్రపటాలను విద్యార్థులు తయారుచేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులకు స్వేచ్ఛ వాతావరణం కల్పిస్తే శక్తి సామర్థ్యాలు బయట పడతాయన్నారు. దేశ స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలను చూసి విద్యార్థులు ఆకర్షితులై వారి భావాలను అలవాటు చేసుకునేందుకు, ఆదర్శంగా తీసుకునేందుకు ముందుకు వస్తారన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు బయోమెట్రిక్ కార్డులు

తీర ప్రాంత రక్షణకు పటిష్ట చర్యలు : కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

తీరప్రాంత రక్షణకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బి ఆర్ అంబేద్కర్ ఆదేశించారు. తీరప్రాంత భద్రత పై బుధవారం కలెక్టర్ ఛాంబర్ లో భద్రతా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశం లో తీరప్రాంత భద్రతా కమిటీ పలు ప్రతిపాదనలు చేసింది. విజయనగరం జిల్లాలో 29 కి మీ తీరప్రాంతం ఉందని, దానికోసం రహదారి ఏర్పాటు, భద్రతా సిబ్బంది గస్తీ చేపట్టేందుకు తీరానికి ఒకటి చొప్పున వాచ్ టవర్, సముద్రం వెంబడి గస్తీ కోసం రెండు వాహనాలు, 16 సిసి కెమెరాలు ఏర్పాటుకు కమిటీ ప్రతిపాదించింది. జిల్లా కలెక్టర్ స్పందిస్తూ బీచ్ కారిడార్ పనులలో భాగంగా మన తీరం వెంబడి 29 కి. మీ రహదారి కోసం ప్రతిపాదిస్తామని చెప్పారు. తీర ప్రాంత గస్తీ కోసం రెండు వాహనాలు ఒక్కో తీరప్రాంతానికి ఒక వాచ్ టవర్ ను సి ఎస్ ఆర్ నిధుల నుండి సమకూరుస్తామని హామీ ఇచ్చారు. సి సి కెమెరాలను కూడా ఏర్పాటు చేస్తామని అన్నారు. తీరంలో ఉన్న మత్స్యకారులు తప్పనిసరిగా వారికి మంజూరు చేసిన బయోమెట్రిక్ గుర్తింపు కార్డులు ధరించాలని, లేని పక్షంలో మెరైన్ పోలీసులు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. మెరైన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో విజయనగరం పట్టణం లో ఉన్న ప్రముఖ ప్రైవేట్ హాస్పిటల్ యాజమాన్యాల సహకారంతో మెడికల్ క్యాంపులు ఏర్పాటుచేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో విశాఖ తీర భద్రత విభాగం ఎఎస్‌పి ఎం. శ్రీనివాసరావు, తూర్పు తీర నావికాదళ లెఫ్టనెంట్ కమాండర్ స్వప్నిల్ చౌహాన్, సీనియర్ ఇంటెలిజెంట్ ఆఫీసర్ వరప్రసాద్ అట్టాడ, ఇంటెలిజెన్స్ బ్యూరో ఆఫీసర్ వెంకటేష్ నాయుడు, మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయ కృష్ణ, కోస్టల్ సెక్యూరిటీ సిఐ బివి జి రాజు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

మధుపాడ తాగునీటి పథకానికి మహర్దశ

- అమృత పథకం ద్వారా రూ.66 కోట్లు
- నీటి సామర్థ్యం పెంపునకు నిధులు కేటాయింపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర వాసులను నిత్యం వేధిస్తున్న సమస్య తాగునీటి సమస్య. ఏటా వేసవి వస్తే చాలు నీటి సమస్య తీవ్రంగా మారుతుంది. నెల్లిమర్ల, మధపాడ పథకాల ద్వారా నీరు సరిగా రాకపోవడంతో నేటికీ రోజు తప్పించి రోజు తాగునీరు పంపిణీ చేయాల్సిన పరిస్థితి అనేక ఏళ్లుగా కొనసాగుతోంది. ప్రస్తుతం రోజూ వచ్చే 15 ఎంఎల్ నీరు వేసవి వస్తే 10 ఎంఎల్‌డికి తగ్గిపోతోంది. దీంతో ప్రతి ఏడాది తోటపల్లి నుంచి లేదా ఆంధ్ర ప్రాజెక్టుల నుంచి నీరు తెప్పించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి కొనసాగింది. కేంద్ర ప్రభుత్వం నీటి సామర్థ్యాలు పెంపుకోసం అమృత 2.0 పథకం ద్వారా నిధులు కేటాయించింది. చెరువులు, నీటి పథకాల నీటి సామర్థ్యం పెంపుదలకోసం నిధులు కేటాయించారు. అందులో భాగంగానే విశాఖ రీజనల్ పరిధిలో పలు మున్సిపాలిటీలకు, నగరపాలక సంస్థలకు నిధులు కేటాయించారు. అందులో భాగంగా విజయనగరం నగర వాసులకు ప్రధాన నీటి వనరైన మధుపాడ నీటి పథకానికి రూ.66.38 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో పూర్తి స్థాయిలో పైప్ లైన్ మరమత్తులు వేయడంతోపాటు, మధుపాడ ద్వారా 3 ఎంఎల్‌డి నీటి సామర్థ్యం పెంచడం దీని ముఖ్య ఉద్దేశం. పబ్లిక్ హెల్త్ శాఖ ద్వారా ఈ పనులు చేపట్టనున్నారు.

మధుపాడ వద్ద పంపు హౌస్

త్వరలో టెండర్లు పిలుస్తాం

అమృత పథకం ద్వారా విజయనగరానికి నీటి సామర్థ్యం పెంపుదల కోసం రూ.66.38 కోట్లు నిధులు విడుదలయ్యాయి. నగర పాలక సంస్థ అధికారులకు ప్రతిపాదనలు తయారు చేసి ఇవ్వాలని కోరాం. ప్రతిపాదనలు వచ్చిన వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం.

ఎస్.జ్యోతి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పబ్లిక్ హెల్త్ శాఖ

సత్య ఇనిస్టిట్యూషన్స్ డైరెక్టర్‌కు అంతర్జాతీయ గుర్తింపు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సత్య గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం. శశిభూషణ రావుకు ఫేమస్ పీపుల్ ఇండియా వరల్డ్ నుండి ప్రతిష్టాత్మక అంతర్జాతీయ గుర్తింపు లభించింది. నావిగేటింగ్ ది పాత్ - కీ స్కిల్స్ ఫర్ ట్రాన్సిషనింగ్ ఫ్రమ్ క్లాస్‌రూమ్ టు బోర్డ్‌రూమ్ అనే విశిష్ట ప్రచురణకు రవీంద్రనాథ్ ఠాగూర్ సమ్మాన్ 2025 కింద 'బెస్ట్ బుక్ ఆఫ్ ది వరల్డ్' అవార్డుతో సత్కరించారు. ఇంగ్లీష్ అసోసియేట్ ప్రొఫెసర్ ఎన్. సతీష్‌కుమార్ సహ రచయితగా ఉన్న ఈ పుస్తకం, విద్య, వృత్తిపరమైన నైపుణ్యాల మధ్య అంతరాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషించే సాఫ్ట్ స్కిల్స్ డెవలప్‌మెంట్‌కు గుర్తింపు పొందింది.ఈ సందర్భంగా శశిభూషణరావు మాట్లాడుతూ కెరీర్ నైపుణ్యాలతో సన్నద్ధం చేయడంలో తమ అంకితభావానికి ఈ గుర్తింపు నిదర్శనంగా నిలుస్తుందని అన్నారు.



విద్యాశక్తి అమలును విరమించుకోవాలి : ఫ్యాప్టో

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ ఏడాది నుంచి విద్యాశాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న విద్యాశక్తి కార్యక్రమం మొదట్లో ఐచ్చికం అని చెప్పి ప్రస్తుతం నిర్బంధం చేయడాన్ని విరమించాలని జిల్లా విద్యాశాఖ అధికారికి ఫ్యాప్టో నాయకులు బుధవారం వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో చైర్మన్ పాల్తేరు శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయ సంఘాలతో మొదట్లో విద్యాశక్తి ఐచ్చికమని చెప్పి ఇప్పుడు నిర్బంధం చేయడం దుర్మార్గమని అన్నారు. మొదట జూలై 31 వరకు అమలు చేయాలని చెప్పి, ఇప్పుడు మార్చి 31వరకు తప్పనిసరి అని అధికారులు ఆదేశాలు ఇస్తున్నారన్నారు. ప్రస్తుతం 10వ తరగతి విద్యార్థులకు ప్రతిరోజు సాయంత్రం అదనపు తరగతులు నిర్వహిస్తున్నమని, కావున 6 నుండి 9 తరగతి విద్యార్థులకు జరిగే విద్యా శక్తి కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నామని తెలిపారు. వినతి ఇచ్చిన వారిలో ఫ్యాప్టో నాయకులు జెఎవిఆర్‌కె. ఈశ్వరరావు, ఎన్‌వి పైడిరాజు, కె. జోగారావు, టి.సన్యాసిరాజు, ఎస్. భాస్కరరావు, కె .శ్రీనివాసరావు, సిహెచ్.సూరిబాబు, ఎంఎ స్వామి, ఎన్.అధివిష్ణు తదితరులు పాల్గొన్నారు.

వినతినిచ్చేందుకు వచ్చిన ఫ్యాప్టో నాయకులు

విధ్వంస పాలనతో వ్యవస్థలు నాశనం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-విజయనగరంకోట

గత వైసిపి ప్రభుత్వంలో జగన్ విధ్వంస పాలనతో వ్యవస్థలను నాశనం చేశారని ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు విమర్శించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా 1వ, 13వ , 14వ డివిజన్లలో బుధవారం ఎమ్మెల్యే పర్యటించారు. కొత్తపేట గొల్లవీధి రామ మందిరం వద్ద నుండి ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అనంతరం కొత్తపేట స్వీపరు వీధి జంక్షన్ (ఆంజనేయస్వామి జంక్షన్) లో సమావేశం నిర్వహించారు. అనంతరం విజయనగరం మండలం చెల్లూరు గ్రామంలో ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. సూపర్ సిక్స్ హామీలలను ప్రజలకు ఇంటింటికి వెళ్లి వివరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో రూ.54లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. హామీలన్నీ అమలు చేసి అభివృద్ధికి చిరునామాగా టిడిపి నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో చెల్లూరు సర్పంచ్ కల్లిపిల్లి ఆదినారాయణ, ఎంపిటిసి బోడసింగి శంకర్రావు, మండల పార్టీ అధ్యక్షుడు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలి నాయుడు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్ మండలం , నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే అదితి

పల్లెనిద్రలో భాగంగా గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

పల్లె నిద్రతో ప్రజలకు మరింత భరోసా : ఎస్‌పి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

గ్రామాలు, వార్డుల్లో పోలీసులు నిర్వహిస్తున్న పల్లెనిద్ర కార్యక్రమంతో ప్రజలకు మరింత భరోసా కల్పిస్తున్నామని ఎస్‌పి వకుల్ జిందల్ తెలిపారు. మంగళవారంరాత్రి జిల్లాలోని పలు పోలీసుస్టేషన్ల పరిధిలో పోలీసు అధికారులు, దత్తత గ్రామాల కానిస్టేబుళ్లు 'పల్లె నిద్ర' కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పల్లె నిద్ర కార్యక్రమంతో ప్రజలకు పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని కలిగిస్తున్నామన్నారు. నేరాల నియంత్రణ, ప్రజల సహకారంతో పోలీసింగ్ను మరింత బలోపేతం చేయడమే పల్లె నిద్ర ప్రధాన లక్ష్యమని అన్నారు. గ్రామాల్లో చిన్న చిన్న గొడవలు పెద్ద నేరాలుగాను, శాంతిభద్రతల సమస్యగా మారే అవకాశముందని, ఇలాంటి అంశాలను క్షేత్ర స్థాయిలో గుర్తించి, చర్యలు చేపడుతున్నామన్నారు. పోలీసు స్టేషన్లుకు వెళ్ళకుండానే వారి సమస్యలను నేరుగా పోలీసు అధికారులకు తెలిపేందుకు 'పల్లెనిద్ర' ఒక వేదికగా నిలుస్తుందన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజలతో మమేకమై, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విషయాలను, గ్రామంలో వివిధ రాజకీయ పార్టీల మధ్యగల విభేదాలను, భూతగాదాలను క్షేత్ర స్థాయిలో గుర్తించి, శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా చూసేందుకు, ప్రజలకు రక్షణగా నిలిచే చట్టాలు, సైబరు మోసాలు, మహిళలు, రహదారి భద్రతపట్ల అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు.

మంత్రి దృష్టికి జిందాల్ సమస్యలు

ప్రజాశక్తి- శృంగవరపు కోట

జిందాల్ భూములు ఇచ్చిన రైతుల సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కరించాలని మంత్రి నాదెండ్ల మనోహర్‌ను నియోజకవర్గ జనసేన నాయకులు బుధవారం విశాఖలో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు వచ్చిన సన్యాసినాయుడు మాట్లాడుతూ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ విశాఖ జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా ఎయిర్‌పోర్టులో ఆయన్ను కలిసి మండలంలోని జిందాల్ అల్యూమినియం కంపెనీకి భూములిచ్చిన నిర్వాసితుల సమస్యల పరిష్కారం చేయాలని కోరారు. ఈ సందర్భంగా స్పందించిన మంత్రి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తవలస మండల జనసేన నాయకులు పిల్లా రామచంద్ర, రామదాసు, కాశీ, కొత్తవలస మార్కెట్ కమిటీ సభ్యులు మల్లువలస శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతాలు

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మూడు అంగన్‌వాడీ సెక్టార్ల పరిధిలో గల గర్భిణులకు బుధవారం సీమంతాలు చేశారు. ఐసిడిఎస్ సిడిపిఒ ఆర్.దేవి, ఎసిడిపిఒ లక్ష్మీబాయి మాట్లాడుతూ తల్లిపాలు శిశువు ఆరోగ్య రక్షణకు కవచంలా పనిచేస్తాయన్నారు. పిల్లలకు వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో వేపాడ, ఎస్‌కెఆర్‌పురం, బొద్దాం సెక్టార్ల సూపర్‌వైజర్లు పి.భాగ్యవతి, డి.అరుణశ్రీ, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, వేపాడ పిహెచ్‌సి వైద్యాధికారి, సర్పంచ్ అర్జునమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను పెంపొందించాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు పెంపొందించేందుకు పని చేయాలని డిప్యూటీ డిఇఒ బి.మోహనరావు కోరారు. స్థానిక ఎస్‌ఎస్‌ఎస్ డిగ్రీ కళాశాలలో బుధవారం ఇన్‌స్పైర్ మానక్ పై సైన్స్ టీచర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్ర చైతన్యం పెంపొందించి సృజనాత్మక ఆలోచనలు పెంపొందించాలని ఆదేశించారు. ఎంఇఒ జి.వాసు మాట్లాడుతూ విజ్ఞాన శాస్త్రం పట్ల ఆసక్తి కలిగిన ప్రతీ విద్యార్థి తన ఆలోచనలను ప్రాజెక్టుల రూపంలో ఆవిష్కరించాలన్నారు. ఉపాధ్యాయులు వారిని దిశానిర్దేశం చేసి శాస్త్ర పరిశోధన పట్ల ఆసక్తిని పెంపొందించాలన్నారు. ప్రతీ హై స్కూల్ ఐదు ప్రాజెక్టులు, ప్రాథమికోన్నత పాఠశాల నుండి మూడు ప్రాజెక్టులు తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అనంతరం ఇన్‌స్పైర్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా సైన్స్ అధికారి టి.రాజేష్, జిల్లా అకడమిక్ కోఆర్డినేటర్ జి.సన్యాసినాయుడు, పెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.వేణుగోపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు కోరారు. మున్సిపాలిటీలోని 14వ వార్డులో బుధవారం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు అమలు చేయడం లేదని విమర్శించారు. ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం మోసాలను ఇంటింటికి వెళ్లి వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు శంబంగి వేణుగోపాల్, రెడ్డి దామోదర్, కౌన్సిలర్లు జి.రమాదేవి, పాలవలస ఉమా శంకర్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- డెంకాడ

ఇటీవల చింతలవలస బెటాలియన్ గేటు ఎదురుగా కారు ఢీ కొనడంతో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతూ మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ కోరాడ గ్రామానికి చెందిన కోరాడ రామునాయుడు కుటుంబానికి ఆంధ్రప్రదేశ్ పోలీస్ వాట్సప్ గ్రూపు ద్వారా తోటి ఉద్యోగులు రూ. 1,50,662లు ఆర్థిక సహాయం అందించారు. బుధవారం రామునాయుడు పెద్ద కర్మలో భాగంగా ఆయన స్వగ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో 5వ బెటాలియన్ అధ్యక్షులు మిత్తిరెడ్డి అప్పలనాయుడు, సభ్యులు లెంక రాము, శీర గణేష్, అక్కుపల్లి గోవింద, మజ్జి కూర్మారావు, గొర్ల శ్రావణ్ కుమార్, మీసాల చంద్రమౌళి, కళ్యాణపు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలకు పూర్వ వైభవం

ప్రజాశక్తి - బొబ్బిలి

గ్రంథాలయాలకు పూర్వ వైభవాన్ని తీసుకు వచ్చేందుకు పని చేయాలని గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ రౌతు రామమూర్తిని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, జిల్లా నాయకులు ప్రసన్నకుమార్, కేశవ, రమేష్ కోరారు. గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ రౌతు రామమూర్తిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను వివరించారు. విద్యార్థులు, యువతకు విజ్ఞానాన్ని పెంచేలా పుస్తకాలు అందుబాటులో ఉంచి గ్రంథాలయ ఉద్యోగులకు 010 పద్దు కింద వేతనాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు కృష్ణదాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెటర్నరీ డిస్పెన్సరీ పరిశీలన

ప్రజాశక్తి - బొబ్బిలిరురల్

మండలంలోని పక్కి గ్రామంలో ఉన్న వేటర్నరి డిస్పెన్సరిని ఎమ్మెల్యే బేబినాయన, బుడా చైర్మన్ టి.లక్ష్మునాయుడు బుధవారం పరిశీలించారు. డిస్పెన్సరీ భవనం నిర్మించి చాలా ఏళ్లు అయినందున, నూతన భవనం నిర్మాణం కోసం నాబార్డు నిధులను మంజూరు చేయాలని సంబంధిత మంత్రితో మాట్లాడుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు సుధాకర్ పక్కి గ్రామ టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న గిరిజనులు

రేషన్ సరుకులు ఇక్కడే ఇవ్వాలి

ప్రజాశక్తి - వేపాడ

గిరిజనులకు రేషన్ సరుకులు తమ గ్రామాల్లోనే ఇవ్వాలని కోరుతూ మండలంలోని వీలుపర్తి సచివాలయం పరిధిలో దుంగా, చినదుంగాడ, కొలుకుపాలెం గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లో రేషన్ సరుకులు తమకు అందుబాటులోకి తీసుకొచ్చి ఇవ్వాలని కోరుతూ బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తామంతా రేషన్ సరుకులు కోసం సుమారు 3కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి వీలుపర్తిలో తీసుకోవాల్సి వస్తుందన్నారు. ముఖ్యంగా వర్షాకాలం వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని తమ గ్రామంలో 250 రేషన్ కార్డులున్నాయని, ఒక ప్రభుత్వం భవనం కూడా ఖాళీగా ఉందని అక్కడకు తీసుకొచ్చి సరుకులు ఇస్తే తమకు ఇబ్బంది ఉండదని చెప్పారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్, ఆర్‌డిఒ, తహశీల్దార్, ఎమ్మెల్యే దృష్టికి కూడా తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా తమ సమస్యల పరిష్కరించి తాము పడుతున్న ఇబ్బందులను తొలగిస్తారని లేనిపక్షంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల గిరిజనులు, మాజీ సర్పంచ్ కొప్పల అప్పారావు, వార్డ్ మెంబర్, డ్వాక్రా మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి- విజయనగరం కోట

స్థానిక రేల్వే స్టేషన్ ఫ్లాట్‌ఫారం నెంబర్ 5 వద్ద బుధవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్టు రైల్వే ఎస్ఐ వి.బాలాజీ రావు తెలిపారు. సుమారు 50 వయస్సు కలిగిన మగ వ్యక్తి మృత దేహం ప్రయాణికులు గుర్తించి సమాచారమిచ్చారన్నారు. మృతుడు సుమారు 6 అడుగులు పొడువు, చామన ఛాయ రంగుతో ఉండి, సిమెంట్ కలర్ టీ షర్ట్, ముదురు నీలం రంగు గల నైట్ ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. చేతికి ఎర్రటి తాడు ఉందని చెప్పారు.

సాగు కష్టమే!

- సాగునీరు అందక, వర్షం కురవక ఎండిపోతున్న వరి
- పలు గ్రామాల్లో నేటికీ పడని వరినాట్లు
- ఆందోళన చెందుతున్న రైతులు

ప్రజాశక్తి - వంగర

ఎండలు ప్రస్తుతం తీవ్రంగా ఉన్నాయి. తోటపల్లి కుడి కాలువ ద్వారా వంగర మండలంలోని శివారు భూములకు సాగునీరు అందలేదు. వర్షం కూడా కొన్నాళ్ల నుంచి కురవకపోవడంతో మండలంలోని పలు గ్రామాలలో వరిచేలు ఎండిపోయి బీటలు వారుతున్నాయి. ఖరీఫ్ సీజను ప్రారంభమై రెండు నెలలు పూర్తయింది. అయినప్పటికీ ఇంతవరకు శివారు భూములకు సాగునీరు అందకపోవడంతో మండలంలోని ఎం.సీతారాంపురం, తలగాం, చినరాజుల గుమ్మడ తదితర గ్రామాలలో నేటి వరకు కూడా వరి నాట్లు వేయలేదు. దీంతో ఆయా గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది రైతులు మాత్రం బోర్ల నీటితో వరినాట్లు వేస్తున్న పరిస్థితి ఉంది. అయినప్పటికీ చాలా కష్టమవుతుందని రైతులు వాపోతున్నారు. ఎందుకంటే బోర్లు కూడా మొరాయిస్తున్నాయని, అందువల్ల డబ్బులు కూడా అధిక మొత్తంలో వెచ్చించవలసి వస్తుందని అయినప్పటికీ నీరు సక్రమంగా రాకపోవడం దమ్ము పనులు కూడా అర్ధాంతరంగా నిలిచిపోయిన పరిస్థితులు ఉన్నాయని రైతులు వాపోతున్నారు. అధికారులు కూడా శివారు భూములకు సాగునీరు అందించలేక చేతులెత్తేసిన పరిస్థితి కనబడడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ముందస్తుగా అధికారులు సాగునీరు అందించేందుకు దృష్టి సారించకపోవడం వల్ల ఇలాంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకొని పార్వతీపురం మన్యం జిల్లా తోటపల్లి కుడి కాలువ ద్వారా మండలంలోని భూములకు సాగునీరు అందించి ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

వంగరలో బీటలు వారి ఎండిపోయిన వరి ఎద

చుట్టూ నదులున్నా సాగునీరు కరువే

మండలం చుట్టూ నిరంతరం భారీగా ప్రవహించే నాగావళి, సువర్ణముఖి, వేగావతి నదులతోపాటు, ఈ మండలంలో మడ్డువలస ప్రాజెక్టు ఉంది. అయినప్పటికీ ఈ మండలంలో గల భూములకు మాత్రం సాగునీరు సక్రమంగా అందటం లేదంటే ఒకింత ఆశ్చర్యానికి గురికాక తప్పదు. ఎందుకంటే వరదల సమయంలో ముంపునకు గురయ్యే ప్రాంతాలలో వంగర మండలం మొదటి వరుసలో ఉంటుంది. సాగునీటి విషయానికి వచ్చేసరికి నీరు అందని పరిస్థితి. మండలం చుట్టూ సాగునీటి వనరులు పుష్కలంగా ఉన్నప్పటికీ వీటిని అందిపుచ్చుకోవడంలో అధికారులు గానీ ప్రజా ప్రతినిధులు గాని విఫలం అయ్యారని విమర్శలు ఉన్నాయి. అందువల్ల రైతులు ఏటా సాగునీటి కోసం అవస్థలు పడుతున్న పరిస్థితి ఉంది. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు సాగునీటి వనరులపై పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తే రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని పలువురు భావిస్తున్నారు.

పథకాలు గురించి వివరిస్తున్న నాయకులు

కూటమితోనే అభివృద్ధి

ప్రజాశక్తి- నెల్లిమర్ల

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని టిడిపి రాష్ట్ర పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్ అన్నారు. ఆయన టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావుతో కలిసి బుధవారం సాయంత్రం గొర్లెపేటలో సుపారిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుకున్న ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం చంద్రబాబు ఆధ్వర్యంలో అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తాడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియాతో మేలైన దిగుబడులు

ప్రజాశక్తి- రామభద్రపురం

నానో యూరియాతో పంటల్లో మేలైన దిగుబడులు సాధించవచ్చునని ఎఒ శివ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళ వారం బూసాయవలస పొలాల్లో వివిధ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకంలో ఇంకా నగదు జమ కాని రైతులు కొత్తగా రైతు సేవా కేంద్రంలో గ్రీవెన్స్ పెట్టుకొనే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఎన్‌పిసిఐ, భూమికి ఆధార్ లింకింగ్ ఉండాలన్నారు. మొక్కజొన్న పంటలో 2వ దపా ఎరువుగా నానో యూరియా 500 ఎంఎల్ పిచికారి చేయాలన్నారు. పంట రుణాలు లేని రైతులు వరి, మొక్కజొన్న పంటలకు పంటల బీమాను ఆగస్ట్ 15 లోపు మీసేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ముచ్చర్లవలస గ్రామ సర్పంచ్ కనిమెరక శంకర్ రావు, గ్రామ రైతులు, వ్యవసాయ విస్తరణ అదికారి వెంకటరమణ, రాజశేఖర్, జీ వరలక్ష్మి పాల్గొన్నారు.

రామభద్రపురం: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ

వేపాడ: మండలంలోని వీలుపర్తిలో ఎఒ స్వాతి ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి పంటకు బీమా ఈ నెల 15 లోపు చేయించుకోవాలని సూచించారు. వరిలో లైన్ షోయింగ్ పద్ధతులు, వరి పొలంలో ఉన్న కాలిబాటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద సేనాపతి అప్పారావు, విఎఎ పవన్ కుమార్, ఎమ్‌టి సన్యాసమ్మ, యూనిట్ ఇంచార్జ్ రాము, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వంగర: రైతులు తమ పంటలకు బీమా చేయించుకోవాలని ఎఒ తట్టికోట కన్నబాబు అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని జగన్నాథవలసలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ప్రతి ఒక్క రైతూ వరి, మొక్కజొన్న పంటలకు బీమా కట్టుకోవాలన్నారు. దిగుబడి ఆధారంగా పంట నష్టం సంభవిస్తే బీమా వర్తిస్తుందన్నారు. అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ డబ్బులు పడని వాళ్ళు ఆందోళన చెందాల్సిన పనిలేదని సమీప రైతు సేవా కేంద్రంలో ఆధార్ 1బి వివరాలతో రైతు సేవ కేంద్రం సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విఎఎ సాయి తేజ, రైతులు పాల్గొన్నారు.

చెత్తబుట్టలు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వీధి విక్రయదారులకు, చిరు వ్యాపారులకు నగరపాలక సంస్థ ప్రజారోగ్య సిబ్బంది చెత్త బుట్టలను అందజేశారు. గంటస్తంభం నుండి నగరపాలక సంస్థ కార్యాలయం వరకు ఉన్న వీధివిక్రయదారులకు, తోపుడుబళ్ళ వర్తకులకు, చిరు వ్యాపారులకు చెత్త బుట్టలను అందించి ఇకనుండి వ్యర్థాలను ఆయా బుట్టలలో వేయాలని సూచించారు. మార్కెట్ ప్రాంతాలలో చిరు వ్యాపారులు తోపుడుబళ్ళ వర్తకులు వ్యర్థాలను, ప్లాస్టిక్ కవర్లను విచ్చలవిడిగా కాలువల్లో పారబోస్తున్నారు. ఈ విషయమై ఎన్నిసార్లు అపరాధ రుసములు విధించినా వారిలో మార్పు రావడం లేదు. దీంతో వర్తకులకు చెత్త బుట్టలను అందజేసామని, ఇకనుండి ఆయా బట్టల్లో మాత్రమే చెత్తలు వేయాలని కమిషనర్ తెలిపారు.

అద్దె బకాయిలు చెల్లించకుంటే ఉపేక్షించేది లేదు

నగరపాలక సంస్థ ఆధీనంలో ఉన్న దుకాణ అద్దె బకాయిలను చెల్లించకపోతే ఉపేక్షించబోమని సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు అన్నారు. బుధవారం ఐడియస్ యంటి షాపింగ్ కాంప్లెక్స్ లో బకాయి ఉన్న దుకాణాల వద్దకు వెళ్లి అద్దెలను రాబట్టారు. కొందరు కొంత సమయం కావాలని కోరగా కాల పరిమితిలోగా అద్దెలు చెల్లించాలని లేనియెడల దుకాణాలను మూసివేస్తామని తెలిపారు. ఈ మధ్య అద్దె దుకాణాల వద్దకు వెళ్లి నోటీసులు అందించడంతోపాటు తక్షణమే అద్దెలు చెల్లించాలని చెప్పారు.

చీపురుపల్లి కేంద్రంగా నాసిరకం సరుకులు

మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు

ప్రజాశక్తి - చీపురుపల్లి

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో వసతి గృహాలకు నాసిరకం వస్తువులను చీపురుపల్లి కేంద్రంగా చేసుకొని సరఫరా చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ గద్దె బాబురావు ఆరోపించారు. బుధవారం చీపురుపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చీపురుపల్లి సెంట్రల్ పాయింట్‌గా చేసుకొని సుమారు 500 కోట్ల రూపాయల కుంభకోణం ఈ సరఫరాలో జరుగుతుందని ఆయన ఆరోపించారు. రాయలసీమలోని నాలుగు జిల్లాలకు 75 కోట్ల రూపాయల టెండర్లను చీపురుపల్లి వాసులే తాజాగా దక్కించుకున్నారని ఆయన వివరించారు. రెండు రాష్ట్రాలకు టెండర్లు పలికిన సదరు వ్యాపారులు పనికిరాని పప్పు ముక్కుపోయిన కందిపప్పు పెసరపప్పు పసుపు వంటివి రెసిడెన్షియల్ స్కూల్ నవోదయ తదితర వసతి గృహాలకు అంటగడుతూ అక్రమంగా ప్రభుత్వ సొమ్మును దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ సంఘటన పైన రాష్ట్ర ముఖ్యమంత్రి, ఇంటెలిజెన్సీ విభాగం అధికారులు చర్యలు తీసుకోని అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ఆయన కోరారు. అధికారులు స్పందించిన పక్షంలో అక్రమ వ్యాపారాన్ని సాక్షాదారాలతో నిరూపించడానికి తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. చీపురుపల్లి కేంద్రంగా నాసిరకం వస్తువుల సరఫరాను నిరూపించ లేకపోతే ప్రభుత్వం ఈ విచారణపై చేసిన ఖర్చును రెవెన్యూ రికవరీ యాక్ట్ ద్వారా తన ఆస్తుల నుండి రికవరీ చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. చీపురుపల్లి కేంద్రంగా జరుగుతున్న అక్రమ వ్యాపారం కారణంగా పార్టీ ప్రతిష్ట కూడా దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే శ్రీకాకుళం విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసి ఫోన్ ద్వారా కూడా సమాచారం అందించానన్నారు. నాసిరకం సరుకులు కారణంగా పలు వసతి గృహాల్లో విద్యార్థులు రోగాల బారిన పడుతున్నారని అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

చేసిన సేవలే గుర్తింపునిస్తాయి

ప్రజాశక్తి- రేగిడి

ఉద్యోగికి చేసిన సేవలే గుర్తింపునిస్తాయని సర్పంచ్ బుడుమూరు పట్టాభి, కరణం శ్రీనివాసరావు అన్నారు. బుధవారం సంకిలి గ్రామ సచివాలయంలో బదిలీపై వెళ్లిన సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ సుప్రియ, మహిళా పోలీస్ స్వాతి, వ్యవసాయ అసిస్టెంట్ సుమ, పంచాయతీ కార్యదర్శి స్వాతి, రామ్ కుమార్ లకు బొకేలు ఇచ్చి, దుస్సాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. ఉద్యోగికి సమయపాలన అవసరమన్నారు. ప్రజలతో సత్సంబంధాలు ఏర్పాటు చేసుకొని మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు, సంకిలినీటి సంఘం అధ్యక్షులు నారు జనార్ధనరావు, సంకిలి పంచాయతీ కార్యదర్శి పోలినా యుడు, విఆర్ఒ దుర్గారావు, ఇంజనీ రింగ్ అసిస్టెంట్ వాసుదేవరావు, వ్యవ సాయ అసిస్టెంట్ జ్యోత్స్న, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ ఫెరిసీ రాణి, డిజిటల్ అసిస్టెంట్ పార్వతి, అప్పాపురం పంచాయతీ కార్యదర్శి రాజ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



రేగిడి.. ఉద్యోగులను సత్కరిస్తున్న నాయకులు

బదిలీ ఎంఎస్‌పిలకు సత్కారం

నెల్లిమర్ల: మండల పరిధిలో బదిలీ అయిన మహిళా పోలీస్‌లకు బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో భోగాపురం రూరల్ సిఐ రామకష్ణ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడకు వెళ్లినా విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా సేవలు అందించి పోలీస్ వ్యవస్థకు పేరు తీసుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బి.గణేష్ తదితరులు పాల్గొన్నారు

సంక్షేమం ఎవరు చేశారో ప్రజా వేదికలో తేల్చుకుందాం

నాగార్జునకు వైసిపి నాయకుల సవాల్

ప్రజాశక్తి - చీపురుపల్లి

వైసిపి పాలనలో ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలే ప్రస్తుతానికి కొనసాగుతున్నాయని, అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నప్పటికీ కూటమి పాలకులు చేసిన అభివృద్ధి ఏమీ లేదని వైసిపి మండల నాయకులు నాయకులు ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా ప్రచార విభాగం అధ్యక్షులు వలి రెడ్డి శ్రీనివాస నాయుడు, జిల్లా కార్యదర్శి ఇప్పిలి అనంతం, మండల పార్టీ అధ్యక్షులు మీసాల వరహాల నాయుడు బుధవారం విలేకరులతో మాట్లాడారు. సంక్షేమ పథకాలకు కేరాఫ్ అడ్రస్‌గా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పాలకులు నిలిచారని, వైయస్ రాజశేఖర్ రెడ్డి పరిపాలన నుండి వైయస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలన వరకు ప్రజా సంక్షేమ పథకాల కోసం ప్రత్యేక కార్యరూపం చేశారని ఈ సందర్భంగా వారు వివరించారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామంటూ సొంత డబ్బా కొట్టుకుంటున్న టిడిపి నాయకులు ప్రజా వేదికకు సిద్ధం కావాలని ఈ సందర్భంగా వారు సవాల్ విసిరారు. డిసిసిబి చైర్మన్‌గా పదవిని చేపట్టిన కిమిడి నాగార్జున అవగాహన లేని ఆరోపణ చేయడం మానుకోవాలని ఈ సందర్భంగా హితోపలికారు. డిసిసిబి చైర్మన్‌గా రైతులకు అవసరమైన కనీసం ఎరువులు కూడా అందించలేని నాగార్జున తమ నాయకులను విమర్శించడం తగదని అన్నారు. సంక్షేమ పథకాలు ఎవరు అందజేశారు ఎంతెంత అందజేశారో ప్రజా వేదికలో తేల్చుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని నాగార్జునకు వీలైతే ఎక్కడ తేల్చుకోవాలో ఆయనే స్థలం చెప్పాలని ఈ సందర్భంగా సవాల్ విసిరారు. ఈ సమావేశంలో గబిడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు : సిఐ

ప్రజాశక్తి - బొబ్బిలి

ర్యాగింగ్, ఈవ్ టీజింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ అన్నారు. పట్టణంలోని తాండ్రపాపరాయ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడు అలవాట్లకు దూరంగా ఉంటేనే మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్'లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న సిఐ సతీష్

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ అన్నారు. పట్టణ పరిసర ప్రాంతాల్లో బుధవారం డ్రోన్ సహాయంతో నలుగురు మందుబాబులపై పోలీసులు కేసు నమోదు చేశారు. అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు నిఘా పెట్టామని, బహిరంగంగా మద్యం తాగుతున్న వారిపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు. పేకాట, అసాంఘిక కార్యకలాపాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో దొంగ ఓట్లు నివారించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఎన్నికల్లో దొంగ ఓట్లు నివారించాలని సిపిఎం నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గం సహాయ ఎన్నికల అధికారి కె.శ్రీకాంత్ రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు రామారావు మాట్లాడుతూ ఎన్నికల్లో దొంగ ఓట్లు వేస్తున్నారని, ఒకే వ్యక్తి రెండు చోట్ల ఓటు వేసి అక్రమాలకు పాల్పడుతున్నారని ఫిర్యాదు చేశారు. దీనివల్ల నిజాయతీ ఓటింగ్‌కి విలువ లేకుండా పోతుందని దొంగ ఓట్లను నివారించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఆర్ఒ శ్రీకాంత్ మాట్లాడుతూ ఒకే వ్యక్తి రెండు చోట్ల ఓటు వేయడం నేరమని అటువంటి ఓట్లు పరిశీలించి తొలగిస్తామని చెప్పారు. నియోజకవర్గం పరిధిలో 248 పోలింగ్ కేంద్రాలున్నాయని ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు, తొలగింపులు ఆన్‌లైన్ ద్వారా, నేరుగా బిఎల్ఒల దృష్టికి తీసుకు రావాలని సూచించారు. పోలింగ్ కేంద్రం భవనాలు శిథిలావస్థకు చేరితే మార్పు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఒకే పోలింగ్ కేంద్రంలో 1200 మందికి మించి ఓటర్లు ఉంటే విభజించి అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నికల డిటి వివిఆర్ జగన్నాథరావు, సిపిఐ నాయకులు ఎం.పాపారావు, కాంగ్రెస్ నాయకులు కె.పద్మనాభం, బిజెపి నాయకులు పి.రాజేష్, బిఎస్‌పి నాయకులు ఎ.వెంకట్రావు, సిబ్బంది సత్తిబాబు, మహేష్, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నాయకులతో మాట్లాడుతున్న తహశీల్దార్

ఇష్టానుసారంగా బోర్లు ఏర్పాటు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో 22 బోర్లు కావాలని ప్రజాప్రతినిధులు ఎంపిడిఒను కోరగా మండల ప్రజాపరిషత్తు నిధులతో అవసరమైన చోట ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ 11 బోర్లు ఏర్పాటుకు అనుమతులిచ్చారు. ఉపయోగం లేని చోట కావాలని కోరడంతో మిగతా వాటికి ఆయన ప్రొసీడింగ్ ఇవ్వలేదు. కానీ ఏ విధమైన అనుమతులూ లేకుండా ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ దేవి నిబంధనలకు విరుద్ధంగా కల్లాల వద్ద, పంట పొలాల్లోనూ, గుడులు వద్ద స్థానిక ప్రజా ప్రతినిధులకు అనుకూలంగా ఉన్న చోట బోరు బావులు తవ్వించారు. ఏఎస్‌పేట, సోంపురం, వేపాడ తదితర గ్రామాలలో ఎంపిడిఒ ప్రొసీడింగు ఇవ్వకుండా తీసిన బోరుబావులకు ఏ విధంగా బిల్లులు చేస్తారో తాము చూస్తామని కూటమి నాయకులే భాహాటంగా చెబుతున్నారు.

ఎంపిడిఒ ప్రొసీడింగ్ ఇవ్వకుండా తవ్విన బోరు ఇదే

అనుమతులు లేని వాటికి బిల్లులు ఎలా పెడతారు?

మండలంలో ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ ప్రొసీడింగ్ ఇచ్చిన 11 బోర్లకు బిల్లులు చెల్లించడంలో మాకు ఎటువంటి అభ్యంతరమూ లేదు. ప్రొసీడింగు ఇవ్వకుండా ఏ అనుమతులూ లేకుండా తవ్విన 9 తాగునీటి బోరుబావులకు ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ దేవి ఏ విధంగా ఇప్పుడు మెజర్మెంట్స్ తీసుకొని బిల్లులు పెడతారు.? జిల్లా పరిషత్ నిధులు నుంచి కానీ, ఎంపిడిఒ నిధులు నుంచి కానీ అనుమతులు ఇవ్వకుండా తవ్విన బోర్లుకు బిల్లులు పెడితే ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసినట్లే కదా. దీనిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ఫిర్యాదు చేస్తాం.

గొంప వెంకటరావు, టిడిపి మండల అధ్యక్షులు, వేపాడ

కారును తప్పించబోయి బస్సు బోల్తా

ప్రాణనష్టం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్న ప్రయాణికులు

ప్రజాశక్తి - గుర్ల

విజయనగరం పాలకొండ రోడ్డులో గుర్ల శ్మశానవాటిక దగ్గరలో బుధవారం మహీంద్ర థార్ కారు ఆర్‌టిసి బస్సు ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. పోలీసులు ఇచ్చిన వివరాలు ప్రకారం.. చీపురుపల్లి నుండి విజయనగరం వెళుతున్న ఆర్‌టిసి బస్సును విజయనగరం నుండి గరివిడి వైపు వెళ్తున్న మహీంద్ర థార్ కారు అతి వేగంగా బస్సుకు ఎదురుగా రావడం గమనించిన ఆర్‌టిసి డ్రైవర్ కారును తప్పించే ప్రయత్నంలో రోడ్డు పక్కకు నడపడంతో ఒక్కసారిగా మట్టి కుంగి బస్స్ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రాణనష్టం జరగపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాద సమయంలో బస్సులో 20 మంది ప్రయాణికులు ఉండగా వారిలో జె.సంతమ్మ, పెంటమ్మా, నాగరాజు, రాము, సూర్య, శ్రీదేవి, బంగారమ్మ స్వల్ప గాయాలతో బయట పడ్డారు. కారు బస్సుకు ఒక వైపు బలంగా ఢీ కొనడంతో కారు నడుపుతున్న మండలంలో గరిడ సర్పంచ్ తిరుముల రెడ్డి సూరిబాబుకు బలమైన గాయాలు కావడంతో అతన్ని, ప్రమాదానికి గురైన ప్రయాణికులను 108 వాహనంలో విజయనగరం మహారాజ సర్వజన ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే ఎస్ఐ నారాయణరావు తనసిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం జరిగిన తరువాత ఒక్కసారిగా ట్రాఫిక్ అంతరాయం కలగడంతో ఎస్ఐ ట్రాఫిక్‌ను క్లియర్ చేసి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బోల్తా పడిన బస్సు

నేరాలు ఘోరాలు

ఆన్‌లైన్ బెట్టింగ్

ఆత్మహత్య చేసుకున్న పోస్టల్ ఉద్యోగి

ప్రజాశక్తి - బొబ్బిలి

ఆన్‌లైన్ బెట్టింగ్ పోస్టల్ ఉద్యోగి ఆత్మహత్యకు దారి తీసింది. బొబ్బిలి పట్టణానికి చెందిన గుత్తి నరేష్ (38) భార్య కీర్తి, కుమార్తెతో కలిసి హైదరాబాద్ వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని మన్సూరాబాద్ ప్రాంతంలో పోస్టల్ ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ వల్ల రూ.9లక్షల వరకు అప్పు అయిపోయారు. అప్పులు తీర్చలేక భయాందోళన చెందిన నరేష్ మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు. బెట్టింగ్ యాప్‌లను రద్దు చేయాలని సూసైడ్ నోట్ రాసినట్లు పోలీసులు చెప్పారు. ఎస్ఐ గిరీష్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.